నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
12 శనివారం 16 నవంబర్ 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



దండేపల్లి : స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

రెబ్బెన : ఇందిరానగర్ లో అరుణాచల శివయ్యకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో స్వామివారికి మొక్కుతున్న యువతి

జైపూర్ : వెలిశాల మల్లన్న వద్ద పెద్దపట్నాలు వేస్తున్న భక్తులు

చెన్నూర్ టౌన్ : శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి : గూడెం సింహద్వారం వద్ద భక్తుల రద్దీ

# కనుల పండువగా కార్తీక పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- నదుల్లో పుణ్యస్నానాలు.. గంగమ్మ తల్లికి మొక్కులు
- వైభవంగా తులసీ పూజలు.. సత్యనారాయణ వ్రతాలు
- గూడెం గుట్టకు పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం కనుల పండువగా సాగాయి. భక్తులు వేలాదిగా తరలిరాగా, ఆలయాలన్నీ కిటకిటలాడాయి. మహిళలు వేకువ జామునే తల స్నానాలు చేసి.. ఉసిరి కొమ్మల ను తులసీ కోటలో ప్రతిష్ఠించి దీపాలు వెలిగించారు. ఆయాచోట్ల గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత నదులతో పాటు వాగుల్లో పుణ్యస్నానాలు ఆచరించి గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. దండేపల్లి మండలంలోని గూడెం గుట్టకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. సుమారు లక్షకుపైగా తరలివచ్చారు. సత్యనారాయణస్వామి ఆలయంలో సుమారు 1500కు జంటలు సామూహిక వ్రతాలు ఆచరించాయి. మహిళలు స్థానిక గోదావరిలో ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. సత్యదేవుడిని కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ఆయన సతీమణి సురేఖ, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ దర్శించు కున్నారు. సుమారు 200 మందికి పైగా భక్తులు, ఆలయ వ్యవస్థాపకుడు గురుస్వామి, చక్రవర్తుల పురుషోత్తమాచార్యులతో మాలాధారణ స్వీకరించారు. దేవాదాయదాఖ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూడెం గోదావరి వద్ద ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు ఆయా మండలాల్లోని ప్రముఖ ఆలయాల్లో కార్తీక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- నమస్తే బృందం



మంచిర్యాల ఏసీసీ : విశ్వనాథాలయంలో శివ లింగానికి పూజలు చేస్తున్న భక్తులు



తాండూర్ : ఐబీలో తులసీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



మంచిర్యాల అర్బన్ : జ్వాలాతోరణం నుంచి వేంకటేశ్వర స్వామి వారిని ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు



దండేపల్లి : సామూహిక వ్రతాలు నోముకుంటున్న భక్తులు



దహెగాం : ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

## ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు



పాల్గొన్న క్రీడాకారులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

లక్షెట్టిపేట, నవంబర్ 15 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను శుక్రవారం పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా ఆడాలన్నారు. ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, పీఈటీ రాజేశ్ ఉన్నారు.



పడ్తనపల్లిలో వరి కోతలు



గొల్లపల్లిలో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

# సన్నాలకు బోనస్.. అంతా బోగస్

- ధాన్యం పొడవు, వెడల్పు కొలిచాకే సన్నాల నిర్ధారణ
- అన్ని రకాలకు ఇవ్వకుండా సవాలక్ష కొర్రీలు
- తెలుసుకోకపోతే అన్నదాతలకు ఇబ్బందులే
- ఉమ్మడి జిల్లాలో పండించిన దాదాపు 50 శాతం సన్న రకాలు ప్రభుత్వ లిస్టులో లేనివే

**33 రకాలకే ఇస్తామంటూ సర్కారు మెలిక**

మంచిర్యాల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మద్దతు ధరకు ధాన్యం కొనడంతో పాటు సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఉత్త బోగసే అని తేలిపోయింది. సన్నాలకు బోనస్ ఇచ్చేందుకు కోట్లాది రూపాయాలు కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న సర్కారు.. 33 రకాలకే బోనస్ అంటూ మెలిక పెట్టింది. కొన్ని రకాల ధాన్యాల పేర్లు చెప్పి, వాటినే సన్నాలుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఇక ఈ విషయం తెలియని రైతులు సన్న వడ్లు పట్టుకొని కొనుగోలు కేంద్రానికి వెళ్తే చాలు.. క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందనుకుంటున్నారు. కానీ.. అసలు విషయం ఏమిటంటే ప్రభుత్వం చెప్పిన 33 రకాలకే బోనస్ వర్తిస్తుంది. ఆ 33 రకాలను కూడా గ్రేన్ క్యాలిఫర్ అనే పరికరంలో పెట్టి పొడవు, వెడల్పు కొలుస్తారు. ధాన్యం గింజ పొడవు 6 ఎం.ఎం కంటే తక్కువగా.. గింజ వెడల్పు 2 ఎం.ఎం కంటే తక్కువగా ఉండాలి. ఈ పొడవు, వెడల్పుల నిష్పత్తి మొత్తం కలిపితే 2.5 ఎం.ఎం కంటే ఎక్కువగా ఉండాలి. అప్పుడే దాన్ని సన్నరకంగా పరిగణలోకి తీసుకుంటారు. పైగా ధాన్యం తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉండకూడదు. ఇచ్చే రూ.500 బోనస్‌కు ఇన్ని రకాల కొర్రీలు పెట్టిన సర్కారు రాష్ట్రంలో 48.91 లక్షల టన్నుల సన్న వరి దిగుబడి వస్తుందని, ఆ మొత్తానికి రూ.500 చొప్పున చెల్లించేందుకు రూ.2,445 కోట్లు అవసరమవుతాయని చెప్పుకుంటుంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది.

### ఉమ్మడి జిల్లాలో 50 శాతం సన్నాలకు కోతే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వరి ఎక్కువగా సాగవుతుంది. మంచిర్యాల జిల్లాలో వానకాలం సీజన్‌లో 3.30 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 65 శాతానికి పైగా సన్నాలే పండించారని అధికారులు చెబుతున్నారు. కాకపోతే మన జిల్లాలో ప్రభుత్వం చెప్పిన 33 రకాల కంటే ప్రైవేట్ కంపెనీలకు చెందిన సన్న రకాలనే ఎక్కువ మంది సాగు చేశారు. సాగైన సన్న ధాన్యంలో 50 శాతం నుంచి 60 శాతం అవే ఉంటాయని మండలాల్లోని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికమంది సాగు చేసిన ఓ సన్న రకం ధాన్యం సీడ్ సగం పిలకలు వచ్చి సగం రాకుండా ఉండిపోయిందని, దాంతో దిగుబడి కూడా తగ్గొచ్చని పేర్కొంటున్నారు. ఇక నిర్మల్ జిల్లాలో ఈ సీజన్‌లో 1.46 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి రానుంది. ఇందులో సన్న రకం ధాన్యం 45 శాతం వరకు ఉంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుండగా, ఇందులో సన్నాలు ఐదువేల మెట్రిక్ టన్నులు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పెద్దగా ధాన్యం కొనుగోళ్లు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే రైతులు సాగు చేసిన సన్న రకాలు.. అధికారులు పెట్టిన నిబంధనలతో సరిపోలడం లేదు. పొడవు, వెడల్పులు ప్రభుత్వం పెట్టిన సైజ్‌లో ఉండడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేట్‌కు విక్రయిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం ఇదే జరుగుతుంది. అధికారులు సైతం ఉద్దేశపూర్వకంగానే తేమశాతం, సైజ్ పేరుతో ధాన్యం కొనుగోలును జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు ఎక్కువగా ప్రైవేట్ దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో జరగడం లేదు. మంచిర్యాల 326, నిర్మల్ 233 సెంటర్లు, కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి వీటిలో పదిశాతం కేంద్రాల్లో కూడా ఇంకా కొనుగోళ్లు మొదలవ్వలేదు. నిర్మల్ జిల్లాలో 15 నుంచి 20 సెంటర్లలోనే కొనుగోలు చేస్తున్నారు.

పెద్దంపేటలో ధాన్యం రాశులు



### వీటికే బోనస్..

రాష్ట్ర ప్రభుత్వం 33 రకాల సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఆ 33 రకాలు ఏమిటంటే.. కంపసాగర్ వరి-1(కేపీఎస్2874), డబ్ల్యూజీఎల్ 44, జేజీఎల్ 27356, బీపీటీ 5204, జేజీఎల్ 28545, డబ్ల్యూజీఎల్ 32100, 14, జేజీఎల్ 384, జేజీఎల్ 11470, ఆర్ఎన్ఆర్15048, జేజీల్ 3828, ఆర్ఎన్ఆర్ 2458, డబ్ల్యూజీఎల్ 962, వరంగల్ వరి-1119, కేఎన్ఎం 733, ఆర్ఎన్ఆర్ 21278, జేజీఎల్ 3855, జేజీఎల్11118, జేజీఎల్ 3844, 1798, డబ్ల్యూజీఎల్ 347, ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్సీ), ఆర్ఎన్ఆర్ 2345, జేజీఎల్ 17004,ఆర్ఎన్ఆర్ 2465, ఎన్ఎల్ఆర్ 34449, ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్సీ), కేపీఎస్ 6251(పీఆర్సీ), జేజీఎల్ 33124(పీఆర్సీ), ఎంటీయూ 1262, ఎంటీయూ 1224 తదితర రకాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తారు.

### సన్న వడ్ల బస్తాకు ఎరుపు దారం.. దొడ్డు రకానికి ఆకుపచ్చ దారం

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన సన్న రకం ధాన్యం పొడవు, వెడల్పు, తేమశాతం.. నిబంధనల మేరకు ఉండి.. 33 రకాల్లో ఒకటైతేనే దాన్ని సన్నరకంగా పరిగణలోకి తీసుకుంటారు. సన్న ధాన్యం నింపిన బస్తాలను ఎరుపు రంగు దారంతో కుడుతారు. అదే దొడ్డు రకాలైతే ఆకుపచ్చ రంగుతో కుడుతారు. రైతులు తీసుకెళ్లిన ధాన్యం ఏ రకంగా పరగణిలోకి తీసుకున్నారో తెలుసుకునేందుకు ఇది ఒక బండ గుర్తుగా పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు. సన్నరకాలను గుర్తించే పరికరాలు అన్ని కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. అనుమానాలుంటే మండల ఏఈవో పరికరంలో చూసి రైతులకు అవగాహన కల్పిస్తారు. కొనుగోలు కేంద్రాల్లో ఒకే.. అన్న తర్వాత మిల్లర్లు ఏమైనా ఇబ్బంది పెడితే వాటిని పరిష్కరించే బాధ్యతను సైతం ఏఈవోలకే అప్పగించారు. 24 గంటల్లో ఏఈవో స్థాయిలో దానికి పరిష్కారం లభించకపోతే డివిజన్ లెవవల్‌లో డీఈ సివిల్ సప్లయ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ దాన్ని పరిష్కరిస్తారు. 48 గంటల్లోనూ అది పరిష్కారం కాకపోతే జిల్లా అగ్రికల్చర్ అధికారి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



సఫారీ వాహనం వద్ద రోడ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో, అధికారులు



అడవిలో ఏర్పాటు చేస్తున్న దారి



అడవిలో నిర్మిస్తున్న మంచె



నీటి కొలను పక్క నుంచి వెళ్తున్న జంగల్ సఫారీ దారి

# ఎంసీసీ క్వారీలో జంగల్ సఫారీ

- అడవిలో 29 కిలో మీటర్ల మేర రైడ్‌కు ఏర్పాట్లు
- వేగంగా కొనసాగుతున్న పనులు
- గాంధారీ ఖిల్లా, ఫారెస్ట్ అందాలు వీక్షించే అవకాశం
- త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామంటున్న అధికారులు

హాజీపూర్, నవంబర్ 15 : మండలంలోని ఎంసీసీ క్వారీలోగల అటవీ అందాలను వీక్షించేందుకు అధికారులు సఫారీకి ఏర్పాట్లు చేస్తున్నారు. నీటి కుంటలు, వన్యప్రాణులు, దట్టమైన అటవీ ప్రాంతాన్ని తిలకించేందుకు దాదాపు 29 కిలో మీటర్ల మేర రైడ్‌కు అన్నీ సిద్ధం చేస్తున్నారు. క్వారీలోని క్రషర్ వద్ద సఫారీ ప్రారంభమవుతుంది. గాంధారీ ఖిల్లా, సల్పాల వాగు, కండి, ఇప్పచెట్టు, మంచ, నాగారం రోడ్డు, క్వారీ వెనుక నుంచి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో దాదాపు 20 కిలో మీటర్ల మేర పలు చారిత్రాత్మక ప్రాంతాలు, వన్యప్రాణులు, అటవీ అందాలను రెండు నుంచి మూడు గంటలు వీక్షించే అవకాశమున్నది. అడవి మధ్యలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్లు, నీటి కుంటలు, మంచెలు, వాచ్‌టవర్లు, చూపరులను ఆకట్టుకుంటాయి. గడ్డి మైదానాల్లో జింక పిల్లల ఆటలు, మయూరాల నాట్యాలు, పక్షుల కిల కిల రావాలు ప్రకృతి ప్రేమికులకు కను విందు చేయనున్నాయి.

### శరవేగంగా పనులు

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఎంసీసీ క్వారీలో జంగల్ సఫారీకి ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. వన్యప్రాణులకు తాగు నీరందించేందుకు రూ. 12 లక్షలతో అక్కడక్కడా కుంటలను ఏర్పాటు చేసి, క్వారీలోని కుంట నుంచి సోలార్ పంపుసెట్ల ద్వారా నీటిని తరలిస్తూ వాటిని నింపుతున్నారు. 29 కిలో మీటర్లలో దాదాపు ఐదు కుంటలు, ఐదు మంచెలను ఏర్పాటు చేశారు. నీటి కుంటల పక్క నుంచి సఫారీ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరో రూ. 12 లక్షలతో 20 కిలో మీటర్లు ప్రయాణించేందుకుగాను 24 మీటర్ల వెడల్పుతో పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. 14 ఫీట్ల వెడల్పుతో సఫారీ వాహనం వెళ్లేందుకు వీలుగా భూమి చదును చేస్తున్నారు. అడవిలో నెమళ్లు, కుందేళ్లు, రేస్ కుక్కలు, దుప్పులు, జింకలు, మెకాలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగు బంట్లు, అడవి దున్నలు, చిరుత పులులు, పెద్దపులులతో పాటు వివిధ రకాల పక్షులున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

### అటవీ అందాలను చూపించే లక్ష్యంతోనే..



జిల్లా ప్రజలకు అటవీ అందాలను చూపించాలనే లక్ష్యంతో ఎంసీసీ క్వారీలో జంగల్ సఫారీ పనులకు శ్రీకారం చుట్టాం. జన్నారం మండలం కవ్వాల్ టైగర్ జోన్ పార్ట్‌లో భాగంగా జంగల్ సఫారీని ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో బొక్కలగుట్ట బీట్, తిమ్మాపూర్ బీట్, పాత మంచిర్యాల బీట్‌లను కలుపుతూ జంగల్ సఫారీ రూట్‌ను ఏర్పాటు చేస్తాం. త్వరలోనే జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హాతవుల్లా, బీట్ ఆఫీసర్లు రాజేందర్, సంతోష్ పనులను శ్రద్ధతో చేపిస్తున్నారు.

- అత్తె సుభాష్, ఫారెస్టు రేంజ్ అధికారి, లక్షెట్టిపేట



గోదావరి నదిలో అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

# వైభవంగా జనగామ పోచమ్మ జాతర ప్రారంభం

కోటపల్లి, నవంబర్ 15 : కోటపల్లి మండలం జనగామ గ్రామంలోని మదన పోచమ్మ జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. జనగామ నుంచి అమ్మవార్లను ఊరేగింపుగా పారుపల్లి సమీపంలోని పంచక్రోశ ఉత్తరవాహిణికి తీసుకువచ్చారు. అక్కడ అమ్మవార్లకు జలాభిషేకాలు నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆపై పూజలు చేశారు. నేడు అమ్మవారి రథోత్సవం, ఆదివారం అమ్మవార్లకు బోనాల సమర్పణతో జాతర ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



జాతర సందర్భంగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులు